# నవాబుపేట కేజీబీవీ పాఠశాలకు మెడికల్ కిట్ వితరణ

# రత్నమొల్ల రవీందర్ రెడ్డి దాతృత్వం

ఇది కద నిజం ,నవాబుపేట: మండల పరిధిలోని పీఎం శ్రీ కేజీబీవీ పాఠశాల విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, పులిమామిడి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త రత్నమొల్ల రవీందర్ రెడ్డి తన ఉదారతను చాటుకున్నారు. సోమవారం పాఠశాల విద్యార్థినుల అవసరార్థం ఆయన మెడికల్ కిట్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థినులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో చదువుతున్న 229 మంది విద్యార్థినులకు ఈ మెడికల్ కిట్ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా పేద విద్యార్థుల ఆరోగ్యం మరియు పరిశుభ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారి విద్యావసరాల కోసం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. రవీందర్ రెడ్డి చేసిన ఈ వినూత్న ప్రయత్నాన్ని మండల విద్యాధికారి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రోహిత్, ఎంఈఓ, పాఠశాల ఉపాధ్యాయ బృందం కలిసి రవీందర్ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇలాంటి చేయూతనివ్వడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.



# ఖుత్బుల్లాపూర్ 60 అడుగుల రోడ్డు

## విస్తరణ పనులను వెంటనే చేపట్టాలి



ఇది కద నిజం ,సైబరాబాద్: ఖుత్బుల్లాపూర్ గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 60 అడుగుల ప్రధాన రహదారి విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించాలని కోరుతూ సోమవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 'ప్రజావాణి' కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఆకుల సతీష్ టీం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొని రోడ్డు విస్తరణ ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖుత్బుల్లాపూర్ గ్రామం వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతమని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వాహన రద్దీ కూడా విపరీతంగా పెరిగిందని తెలిపారు. రోడ్డు విస్తరణ పనులు సంవత్సరాలుగా నిలిచిపోవడంతో ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ సమస్యలు జటిలమై ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలోనే కొంతమంది భూస్వాములకు పరిహారం చెల్లింపులు జరిగినప్పటికీ, మరికొందరికి ఇంకా అందాల్సి ఉందని వారు పేర్కొన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా పెండింగ్‌లో ఉన్న భూస్వాముల జాబితాను వెంటనే గుర్తించి, వారికి తక్షణమే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇంజినీరింగ్ విభాగం ద్వారా వెంటనే టెండర్లు పిలిచి, రోడ్డు పనులను యుద్ధప్రతిపాదికన ప్రారంభించాలని కోరారు. ఈ రహదారి పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి స్థానిక ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నల్ల జై శంకర్ గౌడ్, పులి బలరాం, అరుణ్ రావు, శ్రీనివాస్ గౌడ్, కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# తంగేడుపల్లి వద్ద ఘోర ప్రమాదం

- ఎద్దుల బండిని ఢీకొన్న బైక్
- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



ఇది కద నిజం ,నవాబుపేట: నవాబుపేట మండలం పూలపల్లి గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన దంపతులు తమ పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, తంగేడుపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదం ఒకరి ప్రాణాన్ని బలిగొనగా, మరొకరిని మృత్యువుతో పోరాడేలా చేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పూలపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మార్గమధ్యలో తంగేడుపల్లి వద్ద ఎదురుగా వస్తున్న ఎద్దుల బండిని బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రమైన గాయాలు కావడంతో భాస్కర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కళ్ల ముందే భర్త ప్రాణాలు విడవడం అక్కడున్న వారిని కలచివేసింది. అదే సమయంలో బైక్ వెనుక కూర్చున్న ఆయన భార్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఆమె పరిస్థితి ప్రస్తుతం అత్యంత విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి, ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఒక్కసారిగా జరిగిన ఈ ప్రమాదంతో పూలపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి

## ఆర్థిక సహాయం చేసిన మాజీ కార్పొరేటర్

ఆల్విన్ కాలనీ ,ఇది కద నిజం: శంషిగూడ డివిజన్ పరిధిలోని శంషిగూడకు చెందిన నిరుడు శ్రీనివాస్(58) అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం తో. విషయం తెలుసుకున్న డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్థివ దేహానికి పూలమాల వేసి అంతిమ నివాళులు అర్పించడం జరిగింది. గోపాల్, జోగిపేట్ భాస్కర్, పోశెట్టిగౌడ్, లింగం, సుధాకర్, సత్తయ్య, శ్యామ్, నరసింహ తదితరులు ఉన్నారు.


# చెరువు కట్ట ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి..

నర్సింహులపేట మండలంలోని వంతడపల గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ చెరువు కట్టను ధ్వంసం చేసిన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. జగ్గు తండాకు చెందిన బానోత్ భాస్కర్, బానోత్ ప్రశాంత్ చెరువు కట్టను ధ్వంసం చేశారని ఆరోపించారు.

ఈ చెరువుపై ఆధారపడి సుమారు 20 మంది రైతులు వ్యవసాయం చేసుకుంటున్నట్లు తెలిపారు. గతంలో కూడా మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల ద్వారా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

# సోషల్ మీడియా పై అసెంబ్లీలో చర్చ

- ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న చట్టాలను పరిశీలిస్తున్నాం
- 20 నెలల్లో 1384 కేసులు నమోదు.. హోం మంత్రి.



అమరావతి,ఇది కద నిజం: సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల నియంత్రణపై అసెంబ్లీలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు హోంమంత్రి అనిత సమాధానం ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారాల కట్టడికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటివరకు ఉపసంఘం రెండుసార్లు సమావేశమై వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో అమలు చేస్తున్న చర్యలను సమీక్షించినట్లు చెప్పారు. మన రాష్ట్రంలో ఎలాంటి చర్యలు తీసుకుంటే సమర్థవంతంగా ఉంటాయన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.

విద్వేషపూరిత, అసభ్య పోస్టుల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు సోషల్ మీడియా పోస్టులపై 1,384 కేసులు నమోదు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఇందులో 1,067 మందిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

తప్పుడు ప్రచారాల కట్టడికి కొత్త చట్టం తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అలాగే పాఠశాల విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించకుండా చట్టం తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

# మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి 5000 కోట్ల రూపాయలు కేటాయించాలి

## మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగడాల నాగేశ్వరరావు

ఖమ్మం,ఇది కద నిజం: రాష్ట్ర ప్రభుత్వం వచ్చే 2026- 27 సంవత్సర ప్రణాళిక బడ్జెట్ లో మత్స్య పరిశ్రమ అభివృద్ధి, మత్స్యకారుల సంక్షేమానికి 5000 కోట్ల రూపాయలు కేటాయించాలని, మత్స్యకారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పగడాల నాగేశ్వరరావు అన్నారు.

సోమవారం గ్రీవెన్స్ డే లో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా మత్స్యశాఖ అధికారి గార్లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా, రాష్ట్రవ్యాప్తంగా చనిపోయిన మత్స్యకారుల కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్ గ్రేషియో పెండింగ్ లో ఉన్న 986 కేసులకు ఈ బడ్జెట్ లో నగదు కేటాయించి ఆ కుటుంబాలను ఆదుకోవాలని, మత్స్యకార కుటుంబాల జీవిత భద్రతకు ఇన్సూరెన్స్, ఎక్స్ గ్రేషియో రూ.20 లక్షలకు పెంచాలి, అనారోగ్యం గుండెపోటు ఇతర వ్యాధులతో, చనిపోయిన వారికి కూడా వర్తింప చేయాలి తక్షణ ఆర్థిక సహాయం కింద రెండు లక్షల రూపాయలు వెంటనే ఇవ్వాలని, ప్రతి మత్స్య సొసైటీ జల వనరులకు సరిపడేంత చేప పిల్లలు / రొయ్య పిల్లలు కొనుగోలు కోసం 100 శాతం సబ్సిడీతో నేరుగా మత్స్య సొసైటీ ఖాతాలోనే నగదు జమ చేయాలి, టెండర్ల విధానాన్ని రద్దు చేయాలని, మత్స్యమిత్ర మహిళా (గ్రూపుల స్కీమును పునరుద్ధరించాలి. ప్రతి గ్రూపుకు ఎలాంటి షరతులు లేకుండా 10 లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని, మత్స్యకార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు డి.శ్రీనివాస్, ఎస్. కృష్ణారావు, ఆర్. ప్రకాష్, చింత కొండల్, హరి, తదితరులు పాల్గొన్నారు.

# టెర్పోల్‌లో వెయ్యేళ్ల నాటి శివలింగానికి పూర్వవైభవం



ఇది కద నిజం, సంగారెడ్డి/టెర్పోల్: కాలగర్భంలో కలిసిపోతున్న చారిత్రక వారసత్వాన్ని పునరుద్ధరిస్తూ, టెర్పోల్ గ్రామంలో వెయ్యి సంవత్సరాల నాటి పురాతన శివలింగానికి పూర్వవైభవం లభించింది. శ్రీపాద అనుగ్రహ టెంపుల్స్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శిథిలమైన స్థితిలో ఉన్న ఈ శివలింగానికి అత్యంత భక్తిశ్రద్ధలతో నూతన గ్రానైట్ మండపాన్ని నిర్మించి, పునర్నిర్మాణ ప్రక్రియను పూర్తి చేశారు. గతంలో కేవలం శివలింగం మాత్రమే మిగిలి ఉన్న ఈ ప్రాంతాన్ని గుర్తించిన ట్రస్ట్, సుమారు 17 లక్షల రూపాయల అంచనా వ్యయంతో అద్భుతమైన ఆలయ ప్రాంగణాన్ని తీర్చిదిద్దింది. ఫిబ్రవరి 22న నిర్వహించిన ఈ మహా ఉత్సవంలో భాగంగా శాస్త్రోక్తంగా శివలింగ నేత్రోన్మీలనం, గణపతి మరియు నంది విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. గత ఏడు నెలలుగా ట్రస్ట్ సభ్యులు మరియు స్థానికులు నిరంతరం శ్రమించి ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. నేడు ఈ నూతన ఆలయాన్ని గ్రామస్తులకు అప్పగించడంతో టెర్పోల్ గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా సుమారు 600 మంది భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ జరిగింది.

### దాతల సహకారం అమోఘం: సంతోష్ కాకాని (ట్రస్ట్ చైర్మన్ )

ఈ పునర్నిర్మాణ కార్యం గురించి ట్రస్ట్ చైర్మన్ సంతోష్ కాకాని మాట్లాడుతూ.. చారిత్రక సంపదను కాపాడుకోవాలనే సంకల్పానికి అమెరికాలో నివసిస్తున్న ప్రముఖ దాతలు డాక్టర్ నాగేంద్ర కోడాలి, శ్రీనివాస్ ఒరిగంటి గార్లతో పాటు మరికొంతమంది దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు. వారి ఆర్థిక ప్రోత్సాహం మరియు గ్రామస్తుల అమోఘమైన సహకారంతోనే ఈ బృహత్తర కార్యం సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి శిథిలమైన చారిత్రక దేవాలయాలను గుర్తించి, వాటిని అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.




# రోడ్డు దాటుతుండగా ఆటో ఢీకొని వ్యక్తి మృతి

ఇది కద నిజం :ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. బాలానగర్ సీఐ తెలిపిన వివరాల ప్రకారం... జింకాల్వాడలో

నివాసముండే సిద్ధూ దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. పనులు ముగించుకుని మద్యం మత్తులో బాలానగర్ ఫ్లైఓవర్ పై రోడ్డు దాటుతుండగా కూకట్పల్లి నుంచి బోయిన్పల్లి వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టింది. దీంతో సిద్ధూ తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి తరలించారు. బాలానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

